సాక్షి
అన్నమయ్య జిల్లా
శుక్రవారం । 2 । మే । 2025



అకాల వర్షం.. అపార నష్టం

అకాల వర్షాలు రైతుకు నష్టాన్ని మిగిల్చాయి. గురువారం కురిసిన తేలికపాటి వర్షానికి ఈదురు గాలుల జీభత్సం తోడవడంతో మామిడికాయలు నేలరాలాయి. -8లో



నమ్మి చేరదీస్తే .. నగలు దోచేశాడు!

తెలిసిన వాడని నమ్మి చేరదీసినందుకు గట్టి బుద్ధి చెప్పాడు ఓ యువకుడు. వంద గ్రాముల బంగారు నగలు, రూ.50 వేల నగదును దోచుకున్నాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.80	రూ.100
రెండోరకం	రూ.60	రూ.70



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 502 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	580	580
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 77.900 కిలోలు

న్యూస్‌రీల్

సీఐల బదిలీ

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలో పని చేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. మైదుకూరు సీఐ శ్రీహరిని కడప సీసీఎస్–2కు బదిలీ చేశారు. సీసీఎస్–2 సీఐగా ఉన్న రెడ్డెప్ప కడప తాలూకా సీఐగా, తాలూకా సీఐ వెంకటేశ్వర్లును వీఆర్‌కు, ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ సీఐ రమణారెడ్డిని మైదుకూరు అర్బన్ సీఐగా, అన్నమయ్య జిల్లా వీఆర్‌లో ఉన్న రియాజ్ అహ్మద్‌ను ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ చేశారు. అలాగే కడప వీఆర్‌లో ఉన్న వెంకటకుమార్ ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ అయ్యారు. ఆయా సీఐలు తమకు కేటాయించిన స్టేషన్లకు వెళ్లి రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

ఆంధ్రాట్యాక్స్ కట్టని బస్సుకు జరిమానా



బస్సు రికార్డులను పరిశీలిస్తున్న రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట: కడప–రేణిగుంట జాతీయరహదారిలో ఆంధ్రా ట్యాక్స్ కట్టని బస్సును గుర్తించామని రాజంపేట ఎంవీఐ వినోద్‌కుమార్ గురువారం తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న బస్సు రికార్డులను పరిశీలించామ న్నారు. రవాణాశాఖకు సంబంధించి ట్యాక్స్‌లు లేవని గుర్తించామన్నారు. రూ.307000 జరిమానా విధించినట్లు చెప్పారు. అలాగే రవాణాశాఖ నిబంధనలు పాటించని వాహనాలకు రూ.50వేలు జరిమానా విధించామన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



మహేష్ యాదవ్

రాజంపేట టౌన్: రాజంపేట కేంద్రీయ విద్యాలయం పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న పి.కార్తీక్ మహేష్ యాదవ్ అండర్–17 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. కేంద్రీయ పాఠశాలల విభాగంలో ఇటీవల తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్‌లో జరిగిన రీజనల్ స్థాయి పోటీల్లో కార్తీక్ మహేష్ యాదవ్ ప్రతిభ కనబరచడంతో అధికారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కేంద్రీయ పాఠశాలల విభాగంలో త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. రీజనల్ స్థాయి పోటీలకు మహేష్ కెప్టెన్‌గా కూడా వ్యవహరించడం విశేషం. తల్లిదండ్రులు వేణుగోపాల్, బుజ్జమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ మురగేశ్వరన్, పీఈటీ రాహుల్‌కుమార్‌ల ప్రోత్సాహం వల్లే తాను కబడ్డీలో రాణిస్తూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మహేష్ తెలిపాడు.

మేడేపై అవగాహన వారోత్సవాలు

కడప కోటిరెడ్డిసర్కిల్: వివిధ రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికులకు 1 నుంచి 7వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మేడే అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గురువారం కడప ఆర్టీసీ గ్యారేజీలో మేడేని పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మికుల దినోత్సవ ప్రాధాన్యత వివరించారు. కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కనీస వేతన చట్టం, పనివేళలు తదితరాలపై వివరించారు.

అథ్లెటిక్స్‌లో బంగారు పతకం




ప్రశంసా పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ మురగేశ్వరన్

రాజంపేట టౌన్: రాజంపేటలోని కేంద్రీయ విద్యాలయంలో పదవ తరగతి చదువుతున్న ఉదయ్ శంకర్ డిస్కస్ త్రోలో బంగారు పతకాన్ని సాధించారు. దీంతో గురువారం కేంద్రీయ విద్యాలయం పాఠశాలలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మురగేశ్వరన్ ఉదయ్‌శంకర్‌ను మెడల్, ప్రశంసాపత్రం అందచేసి సత్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గత నెల 27వ తేదీ నుంచి 30 వరకు తెలంగాణా రాష్ట్రంలోని గొల్కొండలో నిర్వహించిన రీజనల్ అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థి విశేష కనబరచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడని తెలిపారు. పీఈటీ రాహుల్‌కుమార్ కృషి వల్లే విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్నారన్నారు.

మట్టే.. కొల్లగొట్టే..



గుర్రంకొండ మండలంలో జేసీబీల ద్వారా టిప్పర్లనుపెట్టి మట్టి తరలిస్తున్న దృశ్యం



- అధికారం అండగా యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- టీడీపీ నాయకులకు కప్పం కట్టి మట్టి తరలించుకుంటున్న వైనం
- మరికొన్ని ప్రాంతాల్లో రాత్రికి రాత్రి తరలించి సొమ్ము చేసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు

సాక్షి రాయచోటి: జిల్లాలో అధికారం అండగా తెలుగు తమ్ముళ్లు ఆర్థికంగా బలపడటం కోసం అన్నిదారులు వెతుకుతున్నారు. ఇప్పటికే భూములు, ఇసుక, మైనింగ్, మద్యం ఇలా అన్నింటినీ చెరబట్టారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఉన్న కాడికి సర్దుతున్నారు. ఇదే కోవలో మట్టిలోనూ తైలం తీసి కాసులు గడిస్తున్నారు. జిల్లాలో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా చెరువులు, కుంటల్లోని మట్టి తరలిపోతోంది. ఇదేమని అడిగే అధికారులు లేకపోగా...మట్టి తరలింపులో మనకెవరూ అడ్డు అనుకుంటూ మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

కప్పం కట్టాల్సిందే

జిల్లాలోని పీలేరు నియోజకవర్గం గుర్రంకొండలో కప్పం కట్టి మట్టి తరలించుకోవాలంటే కొంతమంది తెలుగు తమ్ముళ్లు అక్కడక్కడ ట్రాక్టర్‌మట్టికి రూ. 200–300 వరకు వసూలుచేస్తున్నారు. అంతేకాకుండా ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని జేసీబీ ద్వారా నిరంతరాయంగా తవ్వకాలు కొనసాగిస్తున్నారు. గ్రావెల్, మట్టిని అంతటా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. పత్రికల్లో వచ్చిన సందర్భంలో ఒకటి, రెండు రోజులు హడావుడి చేయడం, తర్వాత యథా రాజా...తథా ప్రజా అన్నట్లు సాగిపోతోంది. గుర్రంకొండ మండలంలో రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోని మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లోని గుట్టల్లో నుంచి మట్టి పెద్ద ఎత్తున తరలించడంతో గుట్టలుసైతం తరలిగిపోయాయి. సుండుపల్లె మండలంలోనూ అదునుచూసుకుని రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా మట్టిని మాఫియా ఊరు దాటిస్తోంది.

» వెంచర్లకు తరలింపు

జిల్లాలో రియల్ ఎస్టేట్‌కు సంబంధించి వేసే వెంచర్లకు మట్టి అవసరమవుతుంది. దానిని కూడా తెలుగు తమ్ముళ్లు అవకాశ వాదంగా మలుచుకుని రియల్టర్ల నుంచి ఎంతోకొంత వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్ల ఈ తంతు కొనసాగుతున్నట్లు సమాచారం. వెంచర్లు వేసే సమయంలో ఎక్కడికక్కడ రోడ్లకు మట్టి తరలింపు అవసరం. కొన్నిచోట్ల గ్రావెల్, మరికొన్నిచోట్ల మట్టిని తరలిస్తున్నారు. వెంచర్లకు అవసరమయ్యే మట్టిని కూడా కూటమి నేతలు గుంపగుత్తగా మాట్లాడుకుని మట్టి తోలుతూ వెనకేసుకోవడం పరిపాటిగా మారింది.



అధికార పార్టీ అక్రమార్కులు మట్టి తరలించడంతో బోసిపోతున్న కొండలు

పల్లె వైద్యానికి తాళం

- ఎంఎల్‌హెచ్‌పీల ఆందోళన
- మూతపడిన హెల్త్ క్లినిక్‌లు

రాయచోటి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని వర్గాల సమస్యలను పరిష్కరిస్తామని, అభివృద్ధిని పరుగులు తీయిస్తామని చెప్పిన కూటమి నాయకుల మాటలు నేడు నీటి మూటలుగా మిగిలాయి. ప్రజల చెంతకు పాలనను సచివాలయం రూపంలో తెచ్చిన వ్యవస్థను నీరుగార్చే ప్రయత్నం చేశారు. ఇంకోవైపు అంగన్ వాడీ వర్కర్ల సమస్యలను గాలికి వదిలారు. ప్రస్తుతం గ్రామాల్లో నిర్మించిన హెల్త్ క్లినిక్‌లలో సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు, సిబ్బంది సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైంది. వారి సమస్య పట్ల ఏమాత్రం శ్రద్ధ చూపకపోవడంతో సమ్మె చేపట్టారు. ఫలితంగా పల్లె ప్రజకు ప్రాథమిక వైద్యం అందకుండా పోయింది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం చొరవచూపాలని నిరసన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారుల వైపు నుంచి ఎలాంటి ఊరట లభించకపోవడంతో నాలుగురోజుల నుంచి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టారు. ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలని, ఇన్సెంటివ్ ఇవ్వాలని, వేతనాలు పెంచాలని కోరుతూ ఎంఎల్‌హెచ్‌పీలు ఏప్రిల్ 17వ తేదీ నుంచి ఆందోళన చేపట్టారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన హెల్త్ క్లినిక్‌ల తలుపులు మూతపడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మారుమూల ప్రాంతాలకు సైతం ప్రభుత్వం తరపు నుంచి మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో హెల్త్ క్లినిక్‌లను నిర్మించారు. ప్రతి కేంద్రంలో రోజు 20 నుంచి 30 మంది ప్రాథమిక వైద్యాన్ని అందుకుంటున్నారు. గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు వ్యాధి నిరోధక టీకాలు, జ్వరం బారిన పడిన బాధితులు ఈ కేంద్రాల్లో చికిత్సలు అందుకుంటున్నారు. పల్లెల్లో వైద్య సేవలు ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నిరసనను కొనసాగిస్తామని ఎపీ ఎంసీఏ జిల్లా నాయకులు శివకుమార్ తెలిపారు.

- సిబ్బంది సమ్మెలోకి వెళ్లడంతో 375 కేంద్రాలు మూతపడ్డాయి. వివిధ చికిత్సల నిమిత్తం ఇక్కడికి వచ్చే వారికి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యామ్నాయాలు చేపట్టకపోవడంతో పల్లె ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యాయి.



సంబేపల్లి మండలం నారాయణరెడ్డిగారి పల్లిలో మూతపడిన హెల్త్‌క్లినిక్

375 కేంద్రాలు, 14 రకాల సేవలు:

పల్లె ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చే క్రమంలో గతంలో కొన్ని గ్రామాలను కలుపుతూ ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు ఐదేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో జిల్లాలో 375 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించింది. ఒక్కో కేంద్రంలో బీఎస్సీ నర్సింగ్ చదివిన వారిని మల్టీ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్‌గా నియమించింది. వీరి సమక్షంలో ఒక్కో కేంద్రంలో 14 రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. ఏఎస్ఎం, ఆశా వర్కర్లు వీరికి సహాయం అందిస్తుంటారు.

» ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో విఫలం

ఎంఎల్‌హెచ్‌పీల ధర్నా నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా సచివాలయ, ఏఎన్ఎంలు వారి స్థానంలో పనిచేయాలని జిల్లా వైద్య శాఖ ఆదేశించింది. అయితే ఇంతవరకు ఆదేశాలు విడుదల కాలేదు. దీంతో సచివాలయ ఏఎన్ఎంలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో సంబంధం లేనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా మంత్రి, కలెక్టర్ చొరవ చూపి ప్రత్యామ్నాయ ఏర్పాట్ల దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి బాలికల కోసం 'కిశోరి వికాసం'



గోడ పత్రిక ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: కౌమార బాలికల సాధికారత లక్ష్యంగా, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కిశోరి వికాసంపై గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ గురువారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈనెల 2వ తేదీ నుండి జూన్ 10 వరకు వివిధ శిక్షణా కార్యక్రమాలను కౌమార బాలికలకు అందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీటని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా

జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి

కౌమార బాలికలకు విద్య ప్రాముఖ్యత, సంపూర్ణ ఆరోగ్యం, రుతు పరిశుభ్రత, పౌష్టికాహారం, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ఆత్మరక్షణ, యోగా, జీవనోపాధి అవకాశాలు, సైబర్, ఆన్‌లైన్ భద్రత, ఆర్థిక నిర్వహణ వంటి అంశాలలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

- ప్రధాని నరేంద్రమోదీ శుక్రవారం అమరావతికి రానున్న సందర్భంగా జిల్లా నుంచి 30 బస్సులలో దాదాపు 1500 మంది జిల్లా ప్రజలు తరలివెళ్తున్నారని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి బయలుదేరిన ఆర్టీసీ బస్సులను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి, డీఆర్ఓ మధుసూదన్ రావు, పీడీ డీఆర్‌డీఏ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చల్లగా చూడమ్మా.. గంగమ్మా





గంగమ్మకు పూజలు చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జాతరకు విచ్చేసిన భక్తులు

కోడూరు గంగమ్మను దర్శించుకొన్న ఎంపీ

రైల్వేకోడూరు అర్బన్: ప్రజలు చల్లగా ఉండేలా దీవించాలని గంగమ్మను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి వేడుకున్నారు. రైల్వేకోడూరులో నిర్వహించిన గంగమ్మ జాతరలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుతో కలిసి ఎంపీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఎంపీ, మాజీ ఎమ్మెల్యేను సత్కరించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 100 ఏళ్ల చరిత్ర కలిగిన కోడూరు గంగమ్మను దర్శించుకోవడం ఎంతో అదృష్టమని తెలిపారు. రైతులు, పేద ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డిధ్వజారెడ్డి, ఉప సర్పంచ్ తోటశివసాయి, సీహెచ్‌రమేష్, జిల్లా యువజన అధ్యక్షుడు శివారెడ్డి, తల్లెంభరత్‌కుమార్‌రెడ్డి, గునిశెట్టిరమేష్, మేడావెంకటసుబ్బయ్య, బుడుగుశివయ్య, డీవీరమణ తదితరులు హాజరయ్యారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల చేతివాటం

- విదేశాల్లో ఉన్న ఉపాధి కూలీలకు డబ్బులు
- అధికారాన్ని అడ్డుపెట్టుకొని కూలీలను ఇబ్బంది పెడుతున్న వైనం



కుర్నూతల గ్రామం అగ్రహారం చెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలిలు



ఉపాధి బిల్లులు చెల్లించాలంటూ క్షేత్ర స్థాయి సిబ్బందిని నిలదీస్తున్న కూలీలు



లక్కిరెడ్డిపల్లె: లక్కిరెడ్డి పల్లె మండలంలో తెలుగు తమ్ముళ్ల బరితెగింపునకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అనేక సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలుగు తమ్ముళ్లు తొలగించారు. వారి స్థానంలో అధికార పార్టీ నాయకులు తమకు కార్యకర్తలుగా పనిచేసే వారిని ఫీల్డ్ అసిస్టెంట్లు గా నియమించుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉంటే అధికార పార్టీ నాయకులు నియమంచుకున్న ఫీల్డ్ అసిస్టెంట్లు నాయకుల అండ చూసుకొని విదేశాల్లో ఉన్న ఉపాధి హామీ కూలీలకు కూడా జాబ్ కార్డులో ఆన్ లైన్ మస్టర్లలో హాజరు వేసుకొని డబ్బులు చెల్లిస్తున్నట్లు ఉపాధిహామీ కూలీల నుంచే ఆరోపణలు ఉన్నాయి. అలాగే పనికి రాకుండా ఇంటి వద్ద ఉన్న వారికి కూడా కూలీ డబ్బులు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇదంతా ఫీల్డ్ అసిస్టెంట్లు ఊరికే చేయడం లేదు. పనికి రాకుండా ఉండే వారి వద్ద ముడుపులు తీసుకొని తమ చేతి వాటం ప్రదర్శిస్తున్నారని పలువురు ఉపాధి కూలీలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉంటే పలువురు కూలీలు క్రమం తప్పకుండా కూలికి వెళ్లినా ఐదు వారాలకు రెండు వారాల కూలి మాత్రమే వారి ఖాతాలో జమ కావడం.. మిగతా మూడు వారాల కూలి జమ కాకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్ల చేతి వాటం బట్ట బయలయింది. పంచాయితీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఉపాధి హామీ పథకం కూలీల కు కూటమి ప్రభుత్వం మేలు చేస్తుంది అని చెపుతున్న మాటలకు క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. ఏది ఏమైనా కూటమి పార్టీ నాయకుల వల్లే ఉపాధి హామీ కూలీలకు అన్యాయం జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి.

పనికి తగిన వేతనం లేదు



ప్రతిరోజు ఎండలో పనులు చేస్తాం.వారంలో మాకు మూడు రోజులకు మాత్రమే కూలీ పడుతుంది.ఇంటి వద్ద ఉన్న వారికి ఆరు రోజులకు కూలీ డబ్బులు ఎక్కువ మొత్తంలో వస్తుంది.కష్టం మాదైతే కూలి డబ్బులు ఇంటి వద్ద ఉన్న వారికి వేస్తారు. అడిగితే పట్టించుకున్న వారే లేరు. మేము చేసిన పనులకు కూలీ డబ్బులు చెల్లించాలి. –అచ్చమ్మ, అగ్రహారం,కుర్నూతల గ్రామం,లక్కిరెడ్డిపల్లె మండలం

కనీస సౌకర్యాలు లేవు



గతంలో ఉపాధి పనులకు వెళితే ఎండ నుంచి ఉపశమనానికి టెంట్ వేసేవారు. నీటి సౌకర్యం కల్పించే వారు.వడదెబ్బ తగిలితే ప్రథమ చికిత్స కోసం కిట్‌ను పనుల వద్ద ఉంచే వారు.మజ్జిగ ప్యాకెట్లు అందించేవారు.ప్రస్తుతం అవి ఏమి లేకపోగా తాము చేసిన పనులకు బిల్లులు రాకుండా ఎవరెవరి పేర్లో మస్టర్లలో ఆన్ లైన్‌లో ఎక్కించుకొని తమ కడుపు కొడుతున్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలి. –శ్రీరాములు,ఉపాధి కూలీ,అగ్రహారం,లక్కిరెడ్డిపల్లె మండలం

ఐదు వారాలు పనిచేస్తే రెండు వారాల బిల్లులు ఇచ్చారు



ఐదు వారాలు పని చేస్తే రెండు వారాల బిల్లులు వచ్చాయి. ఈ విషయం గురించి అడుగుతంటే ఎవరూ పట్టించుకోలేదు. పని మేము చేస్తే డబ్బులు పనులకు రాని వాళ్లకు వేస్తున్నారు. డబ్బులు ఇవ్వాలని సిబ్బందిని నిలదీస్తే మీకు పనులే పెట్టమంటూ బెదిరింపులకు దిగుతున్నారు.ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలి. –నాగలక్ష్మి,కుర్నూతల ,లక్కిరెడ్డిపల్లె మండలం

ఇసుక అక్రమ రవాణా

అడ్డగింత



టక్కోలు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు

సిద్ధవటం: యథేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను గురువారం గ్రామస్తులు టక్కోలులో అడ్డుకున్నారు. ప్రభుత్వం గృహ నిర్మాణానికి ఉచితంగా పెన్నా పరివాహ ప్రాంతాల్లో వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదే అదునుగా భావించిన కొందరు ఉచిత ఇసుక ముసుగులో మండలంలోని డేగనవాండ్లపల్లి, టక్కోలు, మాచుపల్లి, లింగంపల్లి గ్రామాల నుంచి రాత్రి పగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను కడపకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా టక్కోలు మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉచిత ఇసుక ముసుగులో ప్రతి రోజు దాదాపు 50 ట్రాక్టర్ల ద్వారా పెన్నా పరివాహ ప్రాంతాలైన డేగనవాండ్లపల్లి, మాచుపల్లి లింగంపల్లి తదితర గ్రామాల నుంచి ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమం రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు.



టక్కోలు పెన్నా నది ఇసుక తరలించడం వల్ల రాళ్లు ఏర్పడిన దృశ్యం

క్లుప్తంగా

పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి

ములకలచెరువు : పిడుగుపాటుకు రెండు ఆవులు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని సోంపల్లి పంచాయతీ అడివి నాయుని చెరుపల్లికి చెందిన మస్తాన్ అప్పకు చెందిన రెండు ఆవులు ఇంటి సమీపంలోని ఒక చెట్టు కింద కట్టేశాడు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో ఆవులు ఉన్న చెట్టు పైన పిడుగు పడింది. పిడుగుతో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. రూ.లక్ష రూపాయలు నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.

వైద్యం కోసం వచ్చిన వ్యక్తి..


మృతుడు శ్రీనివాసులు

బి.కొత్తకోట : వైద్యం కోసం వచ్చిన మండలంలోని చలిమామిడికి చెందిన శ్రీనివాసులు (70) గురువారం బి.కొత్తకోటలో మృతి చెందాడు. స్థానిక ఓ ఆర్ఎంపీ డాక్టర్ వద్ద వైద్యం కోసం వచ్చాడు. అక్కడ కూర్చున్న కొంతసేపటికి కుప్పకూలిపోయాడు. అతన్ని స్థానిక సీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీనిపై మెడికల్ ఆఫీసర్ కిరణ్‌కు మార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుత్ షాక్‌తో రైతు..

వేముల : మండలంలోని వేల్పుల గ్రామంలో గురువారం రాత్రి వల్లూరు లక్ష్మీనారాయణ అనే రైతు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ తనకున్న పొలంలో అరటి పంట సాగు చేశాడు. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో గాలివాన వస్తున్న సమయంలో తోట వద్దకు వెళ్లాడు అక్కడ మోటార్ స్టార్టర్‌కు ఉన్న ఫీజులు తీసే సమయంలో విద్యుత్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఎస్ఐ సి.తిప్పేస్వామి తెలిపారు. గురువారం అగ్రహారం పంచాయతీ ఆరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన ఎస్.లక్ష్మయ్య నాటుసారా తెచ్చి స్థానికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో.. సిబ్బందితో కలిసి దాడులు చేసి అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుని పై కేసు నమోదు చేసి, రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

విద్యార్థికి పాము కాటు


చికిత్స పొందుతున్న నిశాంత్‌రెడ్డి

మదనపల్లె : పాము కాటుకు గురై విద్యార్థి పరిస్థితి విషమంగా మారిన ఘటన గురువారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. చింతపర్తి గ్రామం పాతకోట పల్లెకు చెందిన శ్రీనాథరెడ్డి కుమారుడు నిశాంత్‌రెడ్డి(14) వేసవి సెలవులు కావడంతో పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ పాము అకస్మాత్తుగా విద్యార్థిని కాటువేయడంతో అపస్మారకస్థితికి వెళ్లి పరిస్థితి విషమించింది. వెంటనే కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

అకాల వర్షం.. అపార నష్టం


అకాల వర్షానికి నేలరాలిన మామిడి కాయలు


నేలకూలిన పెద్ద వృక్షం

- ఈదురు గాలుల బీభత్సం
- కోతకు వచ్చే సమయంలో నేలరాలిన మామిడి కాయలు

లక్కిరెడ్డిపల్లి : అకాల వర్షాలు రైతుకు అపార నష్టాన్ని మిగిల్చాయి. గురువారం సాయంత్రం కురిసిన తేలికపాటి వర్షానికి ఈదురు గాలుల బీభత్సం తోడవడంతో మండలంలోని మద్దిరేవుల, కస్తూరురాజుగారిపల్లి, దప్పేపల్లి గ్రామాల పరిధిలోని మామిడి రైతుల తోటలలో కాయలు పూర్తిగా నేలరాలాయి. పెనుగాలుల బీభత్సానికి మండలంలోని మామిడి రైతుల పంట చేతికందే సమయంలో కుదేలైపోయాడు. పక్వానికి వచ్చిన మామిడి పంట కాస్త నేల రాలిపోగా మామిడి రైతులు గగ్గోలు పెడుతున్నారు. మార్కెట్‌లో నేలరాలిన మామిడి కాయలకు ధరలు లేకపోవడంతో రైతన్న పరిస్థితి గోరుచుట్టుపై రోకటి పోటు అన్న చందంగా మారింది. ప్రతి సంవత్సరం మామిడి పంట పక్వానికి వచ్చే సమయంలో ఈదురు గాలులకు మామిడి కాయలు రాలిపోతూనే ఉన్నాయని, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ ఏడాది మామిడి రైతు ఇన్సూరెన్సును ప్రభుత్వానికి చెల్లించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులు ఎకరాకు రూ. 2250లు చెల్లించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాతో కలిపి కేంద్ర ప్రభుత్వానికి మామిడి రైతులు ఆన్‌లైన్ ద్వారా ఇన్సూరెన్సు కోసం డబ్బులు చెల్లించారు. ఉద్యాన అధికారులు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం వచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

నష్టపోయిన మామిడి రైతును అన్ని విధాలా ఆదుకోవాలి..

అకాల వర్షాలకు నష్టపోయిన మామిడి రైతును అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపీపీ రెడ్డయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యాన శాఖ అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. అలాగే మండలంలో నష్టపోయిన మామిడి రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్ రెడ్డి కోరారు. అలాగే మామిడి రైతుకు ఎకరాకు రూ. 20 వేలు నష్ట పరిహారం తక్షణమే ప్రకటించాలన్నారు.

గాలివీడులో..

గాలివీడు : గాలివీడు మండలంలో గురువారం జోరుగా గాలివాన కురిసింది. రాయచోటి ప్రధాన రహదారిపై పెద్ద వృక్షం నేలకొరిగింది. అంతేగాక చాలాచోట్ల మామిడి తోటల్లో మామిడి పండ్లు ఈదురు గాలులకు నేల పాలయ్యాయి. రహదారులపై వాహనదారులు పలు అవస్థలు పడ్డారు.

గుర్రంకొండలో అతలాకుతలం

- కొట్టుకుపోయిన రేకులషెడ్లు, బంకులు
- నేలకొరిగిన వృక్షాలు
- కూలిపోయిన విద్యుత్ స్తంభాలు


గుర్రంకొండలో సీసీ కెమెరాలూ ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం కూలిపోయి రోడ్డుపై పడిన దృశ్యం

గుర్రంకొండ : గుర్రంకొండలో ఒక్కసారిగా విజృంభించిన గాలివానతో పట్టణం అతలాకుతలంగా మారింది. రేకులషెడ్లు, బంకులు కొట్టుకుపోగా విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. చెట్లు ఎక్కడపడితే అక్కడ నేలకొరిగాయి. గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు పెద్ద ఎత్తున ఈదురు గాలులు వీయడంతో ఒక్కసారిగా వాతావరణం బీభత్సంగా మారిపోయింది. మగ్బీరా, మార్కెట్‌యార్డు వద్ద రేకులషెడ్లు, బంకులు ఈదురుగాలులకు కొట్టుకొని వచ్చి కడప-బెంగళూరు జాతీయ రహదారిపై అడ్డంగా పడిపోయాయి. అదే సమయంలో అక్కడే ద్విచక్ర వాహనంపై నిలబడి ఉన్న రమణ అనే వ్యక్తి పక్క నుంచే రేకులషెడ్డు వెళ్లడంతో చేతికి బలమైన రక్త గాయాలయ్యాయి. అక్కడే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన స్తంభాలు కూలిపోయి విరిగి ఎన్‌హెచ్ 340 రోడ్డుపై పడ్డాయి. పట్టణంతో పాటు తలారివాండ్లపల్లె వద్ద రోడ్డుకు అడ్డంగా పెద్ద వృక్షాలు నేలకొరిగి కూలిపోయి విద్యుత్ తీగలు తెగి పడడంతో ప్రజలు భయభ్రాంతులయ్యారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో మూడుచోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయి వీధుల్లో పడిపోయాయి. అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. రాత్రి 8.30 గంటల వరకు కరెంటు సరఫరా నిలిచిపోవడంతో పట్టణం అంధకారంగా మారింది.


గుర్రంకొండ మార్కెట్‌యార్డు వద్ద ఈదురు గాలులకు రేకుల షెడ్డు కొట్టుకొని వచ్చి రోడ్డుపై పడిన దృశ్యం

ద్విచక్రవాహనం అదుపుతప్పి బీటెక్ విద్యార్థి మృతి



బీటెక్ విద్యార్థి వెంకటేష్ మృతదేహం, వెంకటేష్ (ఫైల్)


తీవ్రంగా గాయపడిన వెంకటశివారెడ్డి

మదనపల్లె : ద్విచక్రవాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొని బీటెక్ విద్యార్థి మృతి చెందిన ఘటన గురువారం వేకువజామున మదనపల్లెలో జరిగింది. నంద్యాల జిల్లా మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన చిన్నరాముడు, అరుణ దంపతుల కుమారుడు వెంకటేష్(21) కురబలకోట మండలం విశ్వం కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కడప జిల్లా కమలాపురానికి చెందిన వెంకటశివారెడ్డి(23) అదే కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ స్థానికంగా పీజీలో ఉంటున్నారు. గురువారం వేకువజామున ఇద్దరూ కలిసి సొంతపనులపై పలమనేరుకు వెళుతుండగా, మదనపల్లె బైపాస్‌రోడ్డు రాయల్ ఉడ్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి వేగంగా వెళ్లి చెట్టును ఢీకొన్నారు. ప్రమాదంలో వెంకటేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థి వెంకటశివారెడ్డి తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

బైకు, కారు ఢీ : తండ్రీ కొడుకుల దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి

ముద్దనూరు : ముద్దనూరు-జమ్మలమడుగు ఘాట్ రోడ్డులో మునయ్యకోన సమీపంలో గురువారం సాయంత్రం మోటార్‌బైక్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో మోటార్‌బైక్‌లో ప్రయాణిస్తున్న తండ్రీ కొడుకు మృతి చెందారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు కొండాపురం మండల చౌటపల్లె గ్రామానికి చెందిన హాజీ మహ్మద్(35), నాలుగేళ్ల తన కుమారుడు ఇమాం సాదిక్‌తో కలిసి ముద్దనూరు వైపు ప్రయాణిస్తున్నాడు. మునయ్య కోన సమీపంలోకి రాగానే జమ్మలమడుగు వైపు ప్రయాణిస్తున్న కారు మోటార్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులిద్దరినీ జమ్మలమడుగుకు తరలించారు. ఆసుపత్రిలో చిన్నారి మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హాజీ మహ్మద్‌ను కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మెడతోటి మూర్తి మృతదేహం

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు మండలం చిన్నమాచుపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మెడతోటి మూర్తి (18) మృతి చెందాడు. తన చిన్నాన్న రాజశేఖర్‌తో కలిసి మూర్తి చెన్నూరుకు వచ్చేందుకు నేషనల్ హైవే రోడ్డు దాటుతుండగా కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన తప్పెట వెంకట సుబ్బారెడ్డి ట్రాక్టర్‌తో ఢీ కొన్నాడు. ఈ ఘటనలో మూర్తి తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిన్నాయపల్లె సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

పోరుమామిళ్ల : మండలంలోని సిద్దవరం పంచాయతీ చిన్నాయపల్లెకు తూర్పున తెలుగుగంగ కాలువ గట్టున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గురువారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి కథనం మేరకు వేపచెట్టుకు ఉరి వేసుకుని ఉన్న వ్యక్తి శవాన్ని అడవి జంతువులు లాగడంతో కింద పడిందన్నారు. ఈ ఘటన నెల రోజుల క్రితం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం కుళ్లిపోయి గుర్తు పట్టేందుకు వీలు లేకుండా ఉంది. మృతుడి ఒంటిపై ఎర్రచొక్కా, గళ్ల లుంగీ ఉన్నాయి. చెట్టుకు చీరతో ఉరి వేయడాన్ని గమనిస్తే ఎవరైనా హత్య చేసి చెట్టుకు వేలాడదీశారా అన్న అనుమానం కలుగుతోంది.

నమ్మి చేరదీస్తే.. నగలు దోచేశాడు!

- బంగారు నగల స్థానంలో నకిలీవి ఉంచాడు
- జల్సాగా ఖర్చు పెడుతుండగా పట్టుబడిన నిందితుడు


బాధితురాలు వరలక్ష్మి


బంగారు నగల స్థానంలో నకిలీవి

కురబలకోట : తెలిసిన వాడని నమ్మి చేరదీసినందుకు గట్టి బుద్ధి చెప్పాడు ఓ యువకుడు. నమ్మకాన్ని వమ్ము చేస్తూ వారింటిలోని రూ.10 లక్షలు విలువ చేసే వంద గ్రాముల బంగారు నగలు, రూ.50 వేల నగదును దోచుకున్న సంఘటన మండల కేంద్రం కురబలకోటలో ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం బాధితురాలి కథనం మేరకు..కురబలకోట ప్రశాంతనగర్‌లో ఎస్. వరలక్ష్మి (64)అనే వృద్ధురాలు కుమారుడు, మాజీ గ్రామ వలంటీర్ గౌరితో కలసి ఉంటోంది. ఈమెకు ఇల్లు తప్ప ఆస్తిపాస్తులు లేవు. చింతకాయ కొట్టడం, కూలిపనులకు వెళ్లడం తదితర కష్టార్జితంతో వంద గ్రాముల దాకా బంగారు నగలు సంపాదించింది. వాటిని ఇంటిలో మంచం కింద ఉన్న లాకర్‌లో భద్రపరిచింది. ఈ క్రమంలో అదే ఊరికి చెందిన ఓ యువకుడు వారింటికి వచ్చి వెళ్లేవాడు. ఇతనికి బండి లేదని నెల క్రితం ఇంట్లో ఖాళీగా ఉన్న టీవీఎస్‌ను కూడా తోలుకోమని ఇచ్చింది. దీంతో అప్పుడప్పుడు అతను వారింటికి బండిలో వచ్చి వృద్ధురాలిని, ఆమె కుమారుడు గౌరిని పలకరించి వెళ్లేవాడు. వృద్ధురాలు కురబలకోట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసేది. అక్కడి నుంచి అప్పుడప్పుడు ద్విచక్రవాహనంలో ఆమెను ఇంటి వద్ద కూడా దించేవాడు. దీంతో అతను మంచి వాడని నమ్మింది. ఇటీవల ఆమె ఓ పెళ్లికి ఇంట్లోని బంగారు నగలు వేసుకుని వెళ్లింది. అది చూసిన ఆ యువకుడు బంగారు నగలపై కన్నేశాడు. ఇంటి తాళాలు ఎక్కడున్నది తెలిసి ఉండడంతో ఎవరూ లేనప్పుడు ఇంటిలోకి ప్రవేశించి మంచం కింద లాకర్‌లోని బంగారు నగలను గుర్తించాడు. అనుమానం రాకుండా అలాంటి వాటినే నకిలీ (రోల్డ్ గోల్డ్)వి ఉంచి అసలైన బంగారు నగలను కొట్టేశాడు. వృద్ధురాలు కావడంతో గుర్తించలేదని భావించి ఈ పని చేశాడు. ఆమె చింతకాయ కొట్టేది. ఆ డబ్బులు రావడంతో వాటిని లాకర్‌లో దాయడానికి పర్సు తీసింది. అందులో ముందు దాచిన రూ. 50 వేలు కనిపించలేదు. అంతేకాదు బంగారు నగలు కూడా తేడాగా కన్పించాయి. ఉన్నవి నకిలీవిగా గుర్తించి హతాశురాలైంది. జీవితమంతా కష్టపడి సంపాదించుకున్న బంగారు నగలు కనిపించకుండా పోవడంతో ఆమె మనసు పగిలిపోయింది. వెంటనే ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారి విచారణలో అసలు దొంగ బయటపడ్డాడు. ఇటీవల ఆ యువకుడు జల్సాగా ఖర్చు పెట్టడం, జోరుగా బెట్టింగులు కాయడాన్ని గమనించిన స్థానికులు కూడా ఇతన్ని అనుమానించారు. నమ్మి చేరదీసిన యువకుడే ఈ పని చేసినట్లు వెల్లడైంది. చోరీ చేసిన నగలను, నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతను అదే ఊరిలో మరొకరి ఇంట్లో ఇటీవల చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైంది. మేలు చేసిన వారికి కీడు తలపెట్టిన ఇతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గత నెల 27వ తేదీన గోటూరి నరసింహారెడ్డి అనే వ్యక్తిపై దాడి చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ఏప్రిల్ 27న గోటూరు నరసింహ, గంగాధర్ కుటుంబాలు కలహాల కారణంగా ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో నరసింహ అనే వ్యక్తిని గంగాధర్, వారి కుటుంబ సభ్యులు నలుగురు కలిసి తలకు తీవ్ర గాయం అయ్యేలా దాడి చేశారు. గాయపడిన నరసింహను కుటుంబ సభ్యులు కడప రిమ్స్‌కు తరలించారు. దీంతో రిమ్స్ పోలీసుల సమాచారం మేరకు గురువారం గంగాధర్, వారి కుటుంబ సభ్యులు మొత్తం ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన లారీ

– ఇద్దరికి గాయాలు


గాయపడిన డ్రైవర్ రవి

సంబేపల్లె : చిత్తూరు- కర్నూలు జాతీయరహదారిపై నారాయణరెడ్డిపల్లె సచివాలయ సముదాయల సమీపంలో గురువారం ట్రాక్టర్‌ను లారీ ఢీ కొట్టింది. స్థానికుల వివరాల మేరకు సంబేపల్లె నుంచి రాళ్లలోడుతో రాయచోటికి వెలుతున్న ట్రాక్టర్ వెనుభాగం నుంచి లారీ ఢీ కొనడంతో ట్రాక్టర్ బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ ట్రాక్టర్ డ్రైవర్ రవి, లారీ డ్రైవర్ మురగేషన్‌ను 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దోపిడీ సొమ్మును రికవరీ చేస్తాం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

రాయచోటి : రాయచోటి పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దోపిడీ దొంగలను అరెస్టు చేసినట్లు రాయచోటి అర్బన్ సీఐ వెంకటచలపతి తెలిపారు. గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్ అరెస్టు చేసిన ఆరుగురిని మీడియా ఎదుట హాజరు పరిచారు. ఇటీవల తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకున్న దొంగల ముఠా ఎత్తున బంగారు నగలు, నగదును దోచుకెళ్లారని తెలిపారు. అంతర్ జిల్లా దొంగల ముఠాలో ఆరుగురిని అరెస్ట్ చేశామని మరొకరు పరారీలో ఉన్నారని. అతని కోసం ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేస్తున్నామన్నారు. రాయచోటి మండలం యండపల్లె గ్రామం పెద్దరామిరెడ్డిగారిపల్లెలో రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి బసిరెడ్డి ఇంట్లో ఏప్రిల్ నెల 16 న జరిగిన చోరీ కేసులో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన ఆరుగురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 61 గ్రాముల వెండి నగలు, 2 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసులో మొత్తం ఏడుగురు నిందితులు ఉండగా వీరిలో ఆరుగురిని అరెస్ట్ చేశామని, పవన్ అనే నిందితుడు పరారీలో ఉన్నాడన్నారు. అతడి వద్దనే దోచుకున్న బంగారు నగలు ఉన్నాయని నిందితుడు పవన్ను కూడా త్వరలో అరెస్టు చేసి బంగారు నగలను రికవరీ చేస్తామని సీఐ వివరాలను వెల్లడించారు.

అక్రమానికి సరికొత్త మార్గం!

- దర్జాగా రైలులో రేషన్ బియ్యం దిగుమతులు
- అరక్కోణం ప్యాసింజర్ ద్వారా జిల్లాకు చేరుతున్న వైనం
- చిత్తూరు జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కోడూరుకు దిగుమతి
- అటువైపు దృష్టి సారించని రైల్వే పోలీసులు

రాజంపేట : తెల్లవారగానే ఇంటి వద్ద బియ్యంబండి వస్తోందంటూ..హారన్ శబ్దం.. గత ప్రభుత్వం చౌకదుకాణం బియ్యాన్ని సరఫరాచేసే బండికాదు..ఇది రైలు..అరక్కోణంనుంచి కడప వరకు నడిచే ప్యాసింజర్ రైలు. ఇప్పుడు ఈరైలులో బియ్యం బస్తాలను రైల్వేకోడూరు స్టేషన్ వరకు తరలిస్తున్నారు. దీంతో ఈ బండి ఇప్పుడు బియ్యం బండిగా ప్రయాణికులు పిలవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అరక్కోణం నుంచి వచ్చే ప్యాసింజర్ రైలు చిత్తూరు, తిరుపతిజిల్లాలో పాటు తమిళనాడు సరిహద్దు పల్లెల నుంచి బియ్యం రైల్వేకోడూరు ఎందుకు తీసుకొస్తున్నారో ప్రయాణీకులు అంతుపట్టడంలేదు. బియ్యం తరలింపు వారి హడాహుడి అంతా ఇంతాకాదు..రైల్వేస్టేషన్ రాగానే బియ్యం బస్తాలను దించుకోవడంతోనే డోర్‌లో సమయం సరిపోతోంది. ప్రయాణీకులు దిగాలంటే ఇబ్బందులు పడుతున్నారు. గురువారం కూడా ఇదే పరిస్థితి రైల్వేకోడూరు స్టేషన్‌లో నెలకొంది.

బోగీలలో చిన్నచిన్న గోనెసంచులలోకి బియ్యం..

బోగీలలో చిన్నచిన్న గోనెసంచుల్లోకి బియ్యం మారుస్తుంటారు. చిన్న చిన్న సంచులను సీట్ల కింద తోసేస్తుంటారు. కనిపించకుండా చేస్తున్న తీరుతెన్నులను ప్రయాణికులు చూసి నివ్వెరపోయారు. ఈ బియ్యం ప్రభుత్వం అందజేసే చౌకదుకాణం బియ్యంగా ప్రయాణికులు గుర్తించారు.

కొద్దిరోజులుగా జరుగుతున్న బియ్యం రవాణా

అరక్కోణం ప్యాసింజర్ రైలులో చౌకదుకాణం బియ్యం రవాణా కావడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 20 మంది ప్యాసింజర్‌లోని వివిధ ఫార్మసిస్‌లో బియ్యం సంచులను ఎగుమతి చేసుకుంటారు. రేణిగుంట-అరక్కోణం మధ్యలో ఉన్న ప్రాంతాల నుంచి ఈ బియ్యం తీసుకొస్తున్నారనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇంత పెద్ద ఎత్తున అరక్కోణం ప్యాసింజర్‌లో రవాణా అవుతుంటే రేణిగుంట రైల్వేపోలీసులు ఏమీ చేస్తున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

రైల్వేకోడూరు అక్రమ రేషన్ బియ్యం నిల్వకు కేంద్రమా అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని పలు గ్రామీణ ప్రాంతాల్లో సేకరించిన రేషన్ బియ్యాన్ని రైల్వేకోడూరులో తరలించడమే మిటి అనేది చర్చనీయాంశంగా మారింది.రేషన్ తరలింపు వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ చేస్తే అక్రమార్కులు వెలుగులోకి వస్తారనే వాదన వినిపిస్తోంది.


అరక్కోణం ప్యాసింజర్ రైలు


రైల్వేకోడూరు స్టేషన్‌లో దించుకోవడానికి సిద్ధంచేసుకున్న బియ్యం